క్లుప్తంగా

మసీదుల్లో బక్రీద్ సందడి



పెనుగొండ మసీదులో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

పెనుగొండ: మండలంలో గురువారం బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మసీదుల వద్ద ఈద్ పార్థనలు నిర్వహించారు. గురువు దిల్షాద్ ఆధ్వర్యంలో ప్రార్ధనలు నిర్వహించారు. పెనుగొండ, ములపర్రు,సిద్ధాంతం, ఆచంటల్లోనూ బక్రీద్ ప్రార్ధనలు నిర్వహించారు. కార్యక్రమంలో షేక్ భాషా, షేక్ మస్తాన్, బాబు సుబాన్, షేక్ కాజా, హనీఫ్, అహమ్మద్ అలీ, మొల్లా షాకీర్ అబ్బాస్ పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: బక్రీద్‌ను నరసాపురం పట్టణంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు ఈ పండుగ త్యాగానికి ప్రతీకగా ప్రతీతి. ఈద్గాలో ముస్లింలు ఉదయం 8.30 గంటల ప్రాంతంలో సామూహిక నమాజ్‌ను చేశారు. కార్యక్రమంలో బులిమస్తాన్, ఆయుబ్‌ఖాన్, ఎర్జానీ, బడావలి, భాషాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బాలచందర్‌కు ఘన సత్కారం



పెనుగొండలో డాక్టర్ బాలచందర్‌ను సత్కరిస్తున్న డాక్టర్ కే ఆర్ రాజు

పెనుగొండ: ఇటీవల పలు ప్రతిష్టాత్మక అవార్డు పొంది తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సాధించిన జాతీయ ఉపాధ్యాయ రత్న అవార్డు గ్రహీత డాక్టర్ బాలచందర్ సాదేకు ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఆర్ రాజు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ కె.రామచంద్రరాజు ఘనంగా సత్కరించారు. గురువారం మానవత ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సాదే సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో మానవత రాష్ట్ర కన్వీనరు డాక్టర్ కోడూరి రాధా పుష్పవతి, రీజనల్ ఛైర్మన్ కర్రి నరేంద్ర రెడ్డి, డాక్టర్ వైవీవీ అప్పారావు, కేవీఆర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్య జయంతి



కరుగోరు మిల్లిలో ఏకలవ్య జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: ఏకలవ్య జయంతి వేడుకలను కరుగోరిమిల్లిలో గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకారంతో ప్రతిష్టించిన ఏకలవ్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ చిల్లే లావణ్య సర్పంచ్ అల్లం పద్మావతి, ఎరుకుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాలశక్తి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి ముత్యాల నాగేశ్వరరావు, ముత్యాల జగ్గారావు, సలాది శ్రీరంగారావు, కాంపాటి నాగరాజు, పెచ్చెట్టి శ్రీనులు పాల్గొన్నారు.

ఆలయ పాలకవర్గ పదవీ బాధ్యతల స్వీకరణ



కనకదుర్గమ్మ దేవస్థానం పాలకవర్గం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని యడ్లబజార్‌లో ఉన్న శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌గా కావలి శ్రీనివాసరావు రెండోసారి పదవీ బాధ్యతలు స్వీకరించారు. గురువారం ఆలయ ఆవరణలో ఈఓ ఎస్.సతీష్‌కుమార్ నూతన పాలకవర్గ సభ్యులతో పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ట్రస్టీలుగా రేలంగి నరసింహమూర్తి (దున్ను), గవర రవి శంకర్, గుండుబోయిన అరుణకుమారి, దాసరి దివ్యశ్రీ, మాదేటి మంగాకుమారి, తాతపూడి శ్రీరాములు, మోగంటి వెంకటరమణ బాధ్యతలు స్వీకరించారు. తమ పాలకవర్గానికి రెండో సారి అవకాశం కల్పించిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌లకు ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ కావలి శ్రీనివాసరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న సురక్ష ద్వారా ఉచితంగా ధ్రువపత్రాలు

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన వివిధ ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా ఇస్తామని ఎంపీడీఓ ఏవీ అప్పారావు చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో కుల, ఆదాయ, జనన, మరణ, మ్యూటేషన్, టైటిల్ డీడ్, వివాహ, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్లు, పట్టాదార్ ఆధార్ సీడింగ్, ల్యాండ్ రికార్డ్స్, కౌలు రైతు (సీసీఆర్‌సీ) కార్డులు, రైస్ కార్డు వంటి సేవలకు ధ్రువపత్రాలు ఉచితంగా అందిస్తామని వివరించారు.

నాడు కల.. నేడు కళకళ

- పేదోడి సొంతింటి కల సాకారం
- వేగంగా ఇళ్ల నిర్మాణాలు
- అక్కరకు వస్తున్న ప్రభుత్వ చర్యలు



శేరేపాలెంలో జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు



కాళీపట్నంలో జగనన్న కాలనీ

మొగల్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాను చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్రలో సొంత ఇల్లు లేని నిరుపేదల కష్టాన్ని చూసి వారి సొంత ఇంటి కల నెరవేరుస్తానని మాట ఇచ్చారు. ఆయన ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తరువాత నవరత్నాలు –పేదలందరికీ ఇళ్ల పథకంలో పేదలకు సొంత గూడు కల్పించేందుకు జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. గ్రామాల వారీగా లబ్ధిదారులను గుర్తించి స్థలం ఇచ్చి ఇల్లు కట్టించి ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధం కాగా మరికొందరు ప్రభుత్వ అందించే రుణంతో ఇళ్ల నిర్మాణం చేపట్టారు.

నియోజకవర్గంలో 10,409 మంది లబ్ధిదారులు

నియోజకవర్గంలోని నరసాపురం పట్టణం, నరసాపురం మండలం, మొగల్తూరు మండలాల్లో సుమారు 10,409 మంది లబ్ధిదారులను గుర్తించారు. నరసాపురం పట్టణంలో 2, మండలంలో సుమారు 43, మొగల్తూరు మండలంలో 24 జగనన్న లే అవుట్‌లు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకూ సుమారు 2797 మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ప్రతి శనివారం హౌసింగ్ డేగా నిర్ణయించి మండలానికి చెందిన అధికారులు జగనన్న కాలనీల్లో పర్యటించి లబ్ధిదారులతో సమావేశమై ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు.

ఇళ్ల నిర్మాణ ప్రగతి ఇలా

నియోజకవర్గంలో మంజూరైన ఇళ్ల స్థలాలు	10,409
నిర్మాణంలో ఉన్న ఇళ్లు	1407
పునాదిలో దశలో ఉన్నవి	573
గోడలు పూర్తి అయినవి	224
శ్లాబ్‌లు పూర్తి అయినవి	164
మొత్తం పూర్తయిన ఇళ్లు	2797

ప్రభుత్వ సాయంతో వేగంగా నిర్మాణాలు

ఇంటి నిర్మాణాలకు ప్రభుత్వం అందిస్తున్న రూ.1.80 లక్షల ఆర్థిక సహాయంతో పాటు రూ.35 వేల డ్వాక్రా రుణంతో పక్కా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. అంతేకాక లబ్ధిదారులకు మరింత చేయూత అందించాలనే ఉద్దేశంతో తక్కువ ధరలకే ప్రభుత్వం సిమెంట్, ఇసుక, ఐరన్ పంపిణీ చేస్తుంది. ఇసుక 20 టన్నులను ఉచితంగా ఇస్తూనే మిగిలిన ఇసుకను తక్కువ ధరకు అందిస్తుంది. అలాగే 450 కేజీల ఐరన్, 90 బస్తాల సిమెంట్‌ను అందిస్తుంది. ప్రభుత్వం అందించే ఆర్థిక సహయం కూడా ఎప్పటికప్పుడు అందుతుండడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు.

మా సొంత ఇంటి కలనెరవేరింది



జగనన్న ఆశయంతో మా సొంత ఇంటి కల నెరవేర్చుకున్నాం. గ్రామంలో మాకు సొంత స్థలంలేదు, ఇళ్లులేదు. గ్రామంలో మాకు పట్టా లిచ్చి ఆర్థిక సహాయం కూడా సకాలంలో అందడంతో సొంతంగా ఇంటిని నిర్మించుకున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం. **– మండా రాజకుమారి, శేరేపాలెం**

చాలా ఆనందంగా ఉంది



గత ప్రభుత్వంలో అనేక సార్లు దరఖాస్తు చేసుకున్నా ఇంటి స్థలం ఇవ్వలేదు. నా భర్త గోపాలకృష్ణ, ఇద్దరు పిల్లలతో అద్దె ఇంట్లో ఉంటున్నాం. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత వలంటీర్ మా వద్దకు వచ్చి దరఖాస్తు చేసుకోమన్నారు. దరఖాస్తు చేసుకున్న నెలలోనే ఇంటి స్థలంతో పాటు ఇళ్లు కూడా మంజూరైంది. ఇప్పుడు సొంత ఇల్లు నిర్మించుకోవడం చాలా ఆనందంగా ఉంది. **– పాలా పార్వతి, నాగదేవత గుడిఏరియా, మొగల్తూరు**

అర్హులందరికీ ఇళ్లు



అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు సిద్ధంగాఉన్నాం. ఈ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. అర్హులై ఉండి ఇంకా ఇంటి స్థలం రాకపోతే దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి వెంటనే మంజూరు చేస్తాం. **– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వచీఫ్‌విప్**

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం తొలగింపు



విద్యుత్ స్తంభం మారుస్తున్న దృశ్యం

పోడూరు: జిన్నూరు గ్రామంలో గ్రంధాలయం వీధిలో మలుపువద్ద ప్రమాదకరంగా ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాన్ని గురు వారం విద్యుత్ శాఖ సిబ్బంది తొలగించి కొత్తగా సిమెంటు స్తంభం వేశారు. ఎల్‌టీ విద్యు త్‌లైన్‌కు సంబంధించిన పాత స్తంభం కిందభాగంలో తుప్పు పట్టడంతో విరిగి పోవడానికి సిద్ధంగా ఉంది. దీంతో లైన్‌మెన్ మొబిన్ స్పందించి సిబ్బంది వంశీ, సాయి, బుల్లియ్యలతో కలిసి పాతస్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని వేశారు.

నేడు పోడూరులో పౌరహక్కుల దినోత్సవం

పోడూరు: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలోని సమావేశహాలులో శుక్రవారం సాయంత్రం 4గంటలకు పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తహసీల్దార్ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని వివరించారు.

ప్రకటన

నా క్లయింట్లు అయిన పశ్చిమ గోదావరి జిల్లా, నర్సాపురం మండలం, రుస్తుంబాద గ్రామం గాడివారి తోట, డోరు నెం.1-48రు నివాసులు యడ్ల పురుషోత్తం గారి కుమారుడు 1) యడ్ల రాజు పురుషోత్తం మరియు యడ్ల సుబ్బారావు గారి కుమారుడు 2) యడ్ల రాజబాబు గార్లు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్లు షెడ్యూలు ఆస్తిని రుస్తుంబాద గ్రామ కాపురస్థులు ప్రస్తుతం [illegible] డోరు నెం.9-1-152/1రు కాపురస్తులు ముగాల జయపాల్ మోజెస్ గారి భార్య 1) ముగాల [illegible] జయపాల్ మరియు వారి ఏకైక కుమారుడు 2) ముగాల [illegible] మోజెస్ మరియు వీరి కుమార్తె మరియు [illegible] గారి భార్య 3) [illegible] [illegible] దస్తావేజు నెం.1352/2022 తే.4-4-2022 [illegible] మొగల్తూరు [illegible] ఉన్న మా క్లయింట్లుకు [illegible] షెడ్యూలు ఆస్తిని నా క్లయింట్లు కొనుగోలు చేయుచున్నారు. ఇందులకు న్యాయపరమైన అభ్యంతరములు ఉన్న యెడల ఒక నెల రోజులలోపున తెలియపర్చవలయును.

షెడ్యూలు: పశ్చిమగోదావరి జిల్లా, నర్సాపురం మండలం,నర్సాపురం యస్.ఆర్.వో లో చేరిన రుస్తుంబాద రెవిన్యూ గ్రామం తాలూకు రుస్తుంబాద గ్రామ పంచాయితీ ఏరియా, గాడి వారి తోటలో చేరిన రి.స.నెం .403/14ఎ రులో యం.0.44 1/2 సెంట్లు మరియు 405/13ఎ రులో యం 0.22 1/2సెంట్లు మొత్తం యం 0.67 సెంట్లులో తూర్పువైపు యం.0.22 సెంట్లు జిరాయితీ మెరక భూమి.

జక్కంశెట్టి శరత్చంద్రబాబు,
అడ్వకేటు,నర్సాపురం -534 275,
ప.గో.జిల్లా.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు



పీఎస్టీఎన్ క్లబ్ భవనంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా గురువారం పట్టణంలో ఉన్న విష్ణాలయాలు, రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో క్షీరారామలింగేశ్వరస్వామి, జనార్ధనస్వామి, చినగోపురంలో శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి, కెనాల్ రోడ్డులో శ్రీ పద్మావతి అలివేలు మంగా సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ దాసోహంజనేయస్వామి, చినబజారు శ్రీ వేంకటేశ్వరస్వామి, బుధవారపు వీధి రామాలయం, యడ్లబజారు సెంటర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లను పుష్పాలు, తులసి దళాలు, తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరణలు చేశారు. క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆంజనేయస్వామి సంకీర్తనలు ఏర్పాటుచేశారు.



పాలకొల్లులో ప్రత్యేకాలంకరణ వేంకటేశ్వర స్వామి

వైభవంగా సత్యనారాయణ వ్రతం

నరసాపురం రూరల్: గాయత్రీ వేదపరిషత్ నరసాపురం ఆధ్వర్యంలో గురువారం రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత గో పూజతో ప్రారంభించిన కార్యక్రమంలో సుమారు 100 జంటలు పాల్గొని సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణతో పాటు అన్నప్రసాదాలను అందించారు. 26 సంవత్సరాలుగా ప్రతీఏటా తొలి ఏకాదశి పర్వదినం రోజున సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు వేదపరిషత్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ సాగర్ తెలిపారు. కార్యక్రమంలో శ్రీ గాయత్రీ వేదపరిషత్ కార్యకర్తలు ఆచంట హరనాథకృష్ణ, ధూళిపాళ రామకృష్ణ, బొర్రా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్, బాలయోగి విగ్రహాల ఆవిష్కరణ



వైఎస్ రాజశేఖరరెడ్డి, బాలయోగి విగ్రహాలను ఆవిష్కరిస్తున్న చెల్లెం ఆనందప్రకాష్, నల్లి రాజేష్

యలమంచిలి: అంబేడ్కర్ తర్వాత రాజకీయాలకు అతీతంగా దళితులకు న్యాయం చేసిన వారిలో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, లోక్‌సభ మాజీ స్పీకర్ గంటి మోహనచంద్ర బాలయోగి ముందు వరుసలో ఉంటారని ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. యలమంచిలి సెంటర్లో స్థానిక సొసైటీ మాజీ త్రిసభ్య కమిటి ఛైర్మన్ మోకా నరసింహారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వారిరువురి విగ్రహాలను మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్‌తో కలిసి గురువారం ఆనందప్రకాష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆనందప్రకాష్ మాట్లాడుతూ రాజశేఖరరెడ్డి సంక్షేమానికి నిలువెత్తు నిదర్శనం అన్నారు. ఇప్పుడు ఆయన బాటలో ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరొక అడుగు ముందుకు వేసి నవరత్నాల ద్వారా పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలకు అతీతంగా రాష్ట్రంలో జీవిస్తున్న అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తున్నారన్నారు. దళితునిగా జన్మించిన గంటి మోహనచంద్ర బాలయోగి దేశంలో అత్యున్నత పదవుల్లో ఒకటైన లోక్‌సభ స్పీకర్‌గా పనిచేసి ఉభయ గోదావరి జిల్లాల అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. అలాగే విగ్రహాల ఏర్పాటుకు కృషి చేసిన మోకా నరసింహారావుతో పాటు దివంగత నాయకుడు నక్కా గిరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు, విప్పర్తి నవీన్, మద్దా శ్రీనివాసరావు, బుడితి జయరాజు, ఉచ్చుల స్టాలిన్, మోకా వెంకటలక్ష్మి, పీతల శ్రీనివాస్, మానుకొండ సోమరాజు, గుండే నగేష్, జవదాల సువర్ణరాజు, చవ్వాకుల సాంబమూర్తి, బుంగా ఆంజనేయులు, గిడ్డి రాజేష్, ఊటాల ప్రసాదరావు, కొడవల విలియమ్స్ రాజు, తాడి శశిధర్, నల్లి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బార్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికలు

నరసాపురం రూరల్: నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నిక శుక్రవారం నిర్వహిస్తామని ఎన్నికల అధికారి పూరిళ్ల శ్రీనివాస్, నిర్వహణ కమిటీ సభ్యులు ఉల్లంపర్తి సత్యనారాయణ, కొల్లాటి ఆదినారాయణ తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ కసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు వివరించారు. అధ్యక్ష పదవికి తానుకొండ సంతోష్ కుమారి, చల్లా దానయ్యనాయుడు పోటీలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ ఎన్నిక ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 162 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. పోలింగ్ పూర్తయిన వెంటనే ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడిస్తామని వెల్లడించారు.

జనసేన నేతల పడిగాపులు

సాక్షి, భీమవరం: గత నాలుగు రోజులుగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో మకాం వేసిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలవడానికి వచ్చిన ఆ పార్టీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఇతర నాయకులను ఫంక్షన్ హాలులోకి వెళ్లకుండా అడ్డుకుంటున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. దీనిలో భాగంగానే గురువారం పవన్‌ను కలవడానికి వచ్చిన పార్టీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లను ప్రధాన గేటు వద్ద అడ్డుకోవడంతో తీవ్ర తోపులాట జరిగింది. దీంతో పార్టీ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ పార్టీపై మక్కువతో లక్షలాది రూపాయల ఖర్చుతో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైనా తమకే పార్టీ అధినేతను కలిసే అవకాశం కల్పించకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. ఎంతో అభిమానంతో పవన్‌ను చూడటానికి పడిగాపులు పడుతున్నా కనీసం పలకరించని పరిస్థితిలో తాము పార్టీకి ఎలా పనిచేస్తామంటూ ధ్వజమెత్తుతున్నారు. కార్యకర్తలకు పవన్ దర్శన భాగ్యం లేకపోవడంతో తీవ్ర నిరాశతో ఎదురుతిరుగుతున్నారు.

సైలెన్సర్లు లేని మోటార్ సైకిళ్లతో జనసైనికుల హంగామా

పట్టణంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ బస చేయడంతో పార్టీ శ్రేణులు, పవన్ సినీ అభిమానులు మోటార్ సైకిళ్లకు సైలెన్సర్లు తీసి భారీ శబ్దాలతో అలజడి సృష్టిస్తున్నారు. ఎర్ర కండువాలను తలకు చుట్టుకుని పార్టీ జెండాలు చేతబూని పట్టణంలోని వీధుల్లో విచ్చలవిడిగా సంచరిస్తూ రోడ్లపై నడిచే ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కాళ్ల మండలానికి చెందిన కొంతమంది జనసైనికులను వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని హెచ్చరించి వదిలారు. ఇంత జరుగుతున్నా పార్టీ అధినేతలు అలజడి సృష్టించే కార్యకర్తలను అదుపులో పెట్టడం మాని అల్లరి చేసేవారు తమ పార్టీ కార్యకర్తలు కాదంటూ చేతులు దులుపుకోవడంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యం



కొంతేరులో సిమెంట్ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

యలమంచిలి: రాష్ట్ర చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే అభివృద్ధి పథకాలకు ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం మనదని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ చెప్పారు. కొంతేరు, అడవిపాలెం గ్రామాల్లో జిల్లా పరిషత్, గడపగడపకూ మన ప్రభుత్వం, పంచాయతీ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, కల్వర్టు పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గమనించి జగనన్నకు బాసటగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ సర్పంచ్‌ల ఛాంబర్ మండల అధ్యక్షుడు వల్లభసాయి వెంకట నరసింహారావు, సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు ఉచ్చుల స్టాలిన్, వైఎస్సార్ సీపీ నాయకులు రావూరి వెంకట కోటి మురళీకృష్ణ, తోట రామకృష్ణ, బుంగా జయరాజు, కుక్కల రామకృష్ణ, పోలుకొండ వెంకటేశ్వరరావు, కొయ్యే నాగేశ్వరరావు, పోలుకొండ ఏలియా భక్తసింగ్, నిమ్మకాయల రామకృష్ణ, జక్కంశెట్టి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

బాధితులకు శ్రీరంగనాథరాజు పరామర్శ



సిద్ధాంతంలో మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



వెలగలవారిపాలెంలో మాంద్రు లక్ష్మీకాంతమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: పెనుగొండ మాజీ ఎంపీపీ కుక్కల రామకృష్ణ సతీమణి వరలక్ష్మి ఇటీవల మృతి చెందడంతో రామకృష్ణ కుటుంబాన్ని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పరామర్శించారు. గురువారం సిద్ధాంతంలోని రామకృష్ణ నివాసంలో వరలక్ష్మి చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బహుజన కులాల నాయకులు చింతపల్లి సూర్యకుమారి, చింతపల్లి గురుప్రసాద్, విద్య మౌలిక సదుపాయాల కార్పొరేషన్ డైరక్టరు కొవ్వూరి వేణు మాధవరెడ్డి, ఎంపీటీసీ చిన్నం ఏడుకొండలు, కుడిపూడి సూర్యనారాయణ, నూకపెయ్యి సూర్యారావు, చింతపల్లి రాజేంద్రప్రసాద్, మాకా దామోదర్ రావు, కుడిపూడి త్రిమూర్తులు, వీరవల్లి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

వెలగలవారిపాలెంలో..

పెనుమంట్ర: ఇటీవల మృతి చెందిన వెలగలవారిపాలెం మాజీ ఎంపీటీసీ మాంద్రు లక్ష్మీకాంతమ్మ కుటుంబ సభులను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు గురువారం పరామర్శించారు. లక్ష్మీకాంతమ్మ మృతి వైఎస్సార్ సీపీకి తీరనిలోటని అన్నారు. వెలగలవారిపాలెం ఎంపీటీసీ సభ్యురాలిగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పలువురు మహిళలు ఆయనను కలిసి సమస్యలు విన్నవించగా వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట పెనుగొండ ఏఎంసీ ఛైర్‌పర్సన్ వెలగల వెంకటరమణ, జడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తాడి రాజారెడ్డి, మార్టేరు ఉపసర్పంచ్ కర్రి వేణుబాబు, నాయకులు వెలగల కనికిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మాంద్రు శాంతకుమారి, ఎస్సీ సెల్ నాయకులు మాంద్రు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.